సాక్షి ఒడిశా

మంగళవారం । 18 । ఏప్రిల్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,15,335లు, వెండి 46.2 గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



యువతకు ఆదర్శం.. బిజూ

- 8లో.



వనం వదిలిరాకుండా

- 8లో.

న్యూస్‌రీల్

సాగునీటి మోటార్లు చోరీ



మోటార్లు అపహరణకు గురవ్వడంతో మిగిలిన పంపులు

జయపురం: సబ్ డివిజన్ పరిధి కుంద్రా సమితిలోని దిగాపూర్, బొరిగాం పరిసరాల్లో 6సాగునీటి మోటార్లు అపహరణకు గురయ్యాయి. ఆదివారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి బాధిత రైతులు బొయిపరిగుడ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దిగాపూర్ సమీపంలోని మూడు సాగునీటి మోటార్లను దొంగలు శనివారం రాత్రి ఎత్తుకు పోయారని గ్రామస్తులు రామచంద్ర పాణిగ్రహి, ఆశిష్ చౌధురి, అజయ చౌధురి ఫిర్యాదు చేశారని పోలీసు అధికారి అశ్వినీ పట్నాయక్ తెలిపారు. అలాగే ఆదివారం రాత్రి మొసిగాం పంచాయతీ బొరిగాం సమీపంలో మరో 3మోటార్లను అపహరించినట్లు రైతులు శాంతిలతా పండా, స్మిత పట్నాయక్, రాజేంద్ర దొర ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. ఒక్కో మోటర్ ద్వారా 10ఎకరాల వరిపంటకు సాగునీరు అందించవచ్చని, అవిప్పుడు చోరీకి గురయ్యారన్నారు. దీంతో పంటకు నీరందించలేని పరిస్థితి ఏర్పడిందని బాధితులు వాపోయారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రాణించిన ప్రమోద్ భగత్

- పారా బాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ, రజత పతకాలు కైవసం



సాధించిన పతకాలతో ప్రమోద్ భగత్

భువనేశ్వర్: బ్రెజిల్ జరుగుతున్న పారా బ్యాడ్మింటన్ ఇంటర్నేషనల్ చాంపియన్‌షిప్-2023 పోటీల్లో రాష్ట్రానికి చెందిన దిగ్గజ ఆటగాడు ప్రమోద్ భగత్ నేతృత్వంలో ఒడిశా షట్లర్లు అద్భుతంగా రాణించారు. స్థానిక కాలమానం ప్రకారం ఆదివారం రాత్రి సావోపాలోలో ముగిసిన డబుల్స్ పోటీల్లో ప్రమోద్ స్వర్ణం, సింగిల్స్‌లో రజత పతకం సాధించాడు. ఈ పోటీల్లో జి.ఢిల్లేశ్వరరావు డబుల్స్‌లో కాంస్య కైవసం చేసుకున్నాడు. పురుషుల ఎస్ఎల్3-ఎస్ఎల్4 డబుల్స్ ఫైనల్‌లో ప్రమోద్, సుకాంత్ కదమ్.. కొరియా జోడీ జూ డాంగ్‌జే, షిన్ క్యుంగ్-హ్వాషల సవాల్‌ను అధిగమించి, 22-20, 21-19తో వరుస సెట్లలో విజయం సాధించారు. జి.ఢిల్లేశ్వరరావు ఎస్ఎల్3-ఎస్ఎల్4 విభాగంలో కాంస్య సాధించాడు. ఈ సందర్భంగా ప్రమోద్ భగత్‌ను ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అభినందించారు. ఈ విజయం యావత్ భారత జాతిని గర్వించేలా చేస్తుందని పేర్కొన్నారు.

యువతి ఆత్మహత్య



చెట్టుకు వేలాడుతున్న కొనిక మృతదేహం

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రానికి సమీపంలోని ఎంవీ-42 గ్రామంలో యువతి ఆత్మహత్యకు పాల్పడింది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కొనిక బిశ్వాస్(17) ఆదివారం రాత్రి ఇంట్లో అందరితో కలిసే ఉంది. అయితే సోమవారం ఉదయం శివారులోని చెట్టుకు వేలాడుతూ కనిపించింది. అటుగా వెళ్లిన గ్రామస్తులు గమనించడంతో వెంటనే మల్కన్‌గిరి పోలీసులకు సమాచారం అందించారు. ఐఐసీ రీగాన్ కీండో, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని, మృతదేహన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిమిత్తం మల్కన్‌గిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

రసవత్తరంగా పోరు

- హోరాహోరీగా ఝార్సుగుడ ఉప ఎన్నిక ప్రచారాలు
- బీజేపీ అభ్యర్థిగా టంకధర్ త్రిపాఠి నామినేషన్ దాఖలు చేశారు
- వ్యూహ, ప్రతివ్యూహాల్లో తలమునకలైన ప్రధాన పార్టీలు



డిప్యూటీ కలెక్టర్‌కు నామినేషన్ పత్రాలు అందిస్తున్న బీజేపీ అభ్యర్థి టొంకొధొరొ త్రిపాఠి

భువనేశ్వర్: ఝార్సుగుడ అసెంబ్లీ నియోజకవర్గానికి మే 10న జరగనున్న ఉప ఎన్నికలో ప్రచారాలు జోరందుకున్నాయి. ప్రధాన పార్టీలు ఒకవైపు నామినేషన్ల ప్రక్రియలో తలమునకలవుతూనే.. ఓటర్లను ఆకట్టుకునేందుకు తమవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా టొంకొధొరొ త్రిపాఠి సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలతో కలిసి భారీ ఊరేగింపుగా వెళ్లిన ఆయన.. ఝార్సుగుడ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్ పత్రాలను అందజేశారు. అంతకుముందు జడేశ్వర్ బాబా, మా కనకేశ్వరి దేవికి పూజలు చేశారు. నామినేషన్ దాఖలు చేసే సమయంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మన్మోహన్ సామల్, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సమీర్ మహంతి, బసంత్ పండా, జుయెల్ ఓరమ్, కనకవర్ధన్ సింగ్‌దేవ్, బర్‌గఢ్ ఎంపీ సురేష్ పూజారి, కేంద్రమంత్రి బిశ్వేశ్వర్ టుడు, పలువురు ఎమ్మెల్యేలు సహా సీనియర్ నేతలు హాజరయ్యారు. ఉప ఎన్నికలో ఝార్సుగూడ ప్రజలు పోరాడతారని, తాను మాధ్యమంగా మాత్రమే నిలువనున్నట్లు త్రిపాఠి పేర్కొన్నారు. గత 23 ఏళ్ల బీజేడీ పాలనలో ఈ ప్రాంతం తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో జరగనున్న ఉప ఎన్నికలో అధికార పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని గట్టి నమ్మకం వ్యక్తం చేశారు.

బీజేడీ నుంచి పెండింగ్..

టొంకొధొరొ త్రిపాఠి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ ప్రజలతో మమేకమై వారి సమస్యల పట్ల స్పందిస్తున్నారు. ఝార్సుగుడలో ఎటువంటి అభివృద్ధి లేదని, తీవ్ర తాగునీటి ఎద్దడి వంటి అంశాలను ప్రధాన సమస్యలుగా పేర్కొన్నారు. ప్రస్తుతం భారతీయ జనతాపార్టీ యువమోర్చా మాజీ అధ్యక్షుడు, రాష్ట్రశాఖ కార్యదర్శిగా కొనసాగుతున్నారు. 41ఏళ్ల త్రిపాఠి విద్యార్థి నాయకుడిగా తొలి రాజకీయ జీవితాన్ని ప్రారంభించాడు. ఆయన స్వస్థలం ఝార్సుగుడలో చురుకైన రాజకీయ నాయకుడిగా గుర్తింపు పొందారు. కాంగ్రెస్ అభ్యర్థి తరుణ్‌పాండే శనివారం తన నామినేషన్ పత్రాలను దాఖలు చేయగా.. హత్యకు గురైన మంత్రి నవకిషోర్ దాస్ కుమార్తె, బిజూ జనతాదళ్ అభ్యర్థి దీపాలీ దాస్ ఉప ఎన్నిక పురస్కరించుకుని నామినేషన్ దాఖలు చేయాల్సి ఉంది. నామినేషన్ పత్రాల దాఖలు గడువు ఈనెల 20తో ముగుస్తుంది. 21న దస్తావేజులను పరిశీలించి, అర్హుల జాబితా బహిరంగ పరుస్తారు. పోటీ నుంచి వైదొలిగేందుకు ఈనెల 24 వరకు ఉపసంహరణకు గడువు కేటాయించారు. మే 10న ఉప ఎన్నిక పోలింగ్ జరుగనుంది.



నామినేషన్ సందర్భంగా ర్యాలీ చేపడుతున్న టొంకొధొరొ త్రిపాఠి

నువాగడ గ్రీవెన్స్‌కు కలెక్టర్ హాజరు



కెరడంగలో వినతులు ఆలకిస్తున్న కలెక్టర్ లింగరాజ్ పండా

పర్లాకిమిడి: జిల్లాలోని నువాగడ బ్లాక్ కెరడంగ పంచాయతీలో సోమవారం జరిగిన గ్రామముఖి పరిపాలన, గ్రీవెన్సుసెల్‌కు కలెక్టర్ లింగరాజ్ పండా హాజరయ్యారు. అదనపు ఎస్పీ వామదేవ్ సింగ్, డీఆర్‌డీఏ పీడీ రమాంచల్ ఖమారీ, జిల్లా సమగ్ర గిరిజనాభివృద్ధి శాఖ పీఓ ఫాల్గుణి మాఝి, ఇతర బ్లాక్ స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చుట్టుపక్కల గ్రామాలైన కెరడంగ, పి.అంతరాడ, నువాగడ, లుహాంగర్ తదితర గ్రామాలకు చెందిన ప్రజలు తమ వినతులను కలెక్టర్‌కు వినతులు అందజేశారు. మొత్తం 55 ఫిర్యాదులు రాగా, ఇందులో 12వ్యక్తిగతం, 43 గ్రామ సమస్యలపై ఉన్నాయి. అనంతరం ఏడుగురుకి మధుబాబు పింఛన్ మంజూరు చేశారు. ఇద్దరికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.5 వేలు, మరో 31మందికి (ఆర్ఓఆర్), దివ్యాంగునికి వీల్‌చైర్ అందజేశారు. ఈ గ్రీవెన్స్‌కు నువాగడ బ్లాక్ అధ్యక్షురాలు మాలతీ ప్రధాన్, బీడీఓ లోకనాథ శొబొరో, తహసీల్దార్ కురేష్‌చంద్ర జాని, ప్రజాప్రతినిధుల నోడల్ అధికారి, జిల్లాస్థాయి అధికారులు విచ్చేశారు.



కెరడంగ పంచాయతీలో భూపట్టాలు పంపిణీ

గుణుపూర్‌లో కలెక్టర్ పర్యటన



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, అధికారులు

రాయగడ: జిల్లాలోని గుణుపూర్‌లో కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్ సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో వినతులు స్వీకరించారు. ఇందులో 36 వినతులు రాగా, 26 వ్యక్తిగతమైనవిగా గుర్తించారు. ఇందులో ప్రధానంగా మౌలిక వసతుల కల్పనపై పలు వినతులు అందాయి. వీటిని సకాలంలో పరిష్కరించాలని సంబంధిత శాఖ అధికారులకు ఆమె ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ రవినారాయణ త్రిపాఠి, జిల్లా ముఖ్య వైద్యాధికారి డాక్టర్ లాల్‌మోహన్ రౌత్రాయ్, గుణుపూర్ సబ్ కలెక్టర్ లలిత్‌కుమార్ కుహారొ, ఐటీడీఏ అధికారి శాంతిప్రభ ప్రధాన్ తదితరులు హాజరయ్యారు. అనంతరం సబ్ డివిజన్‌లోని మారుతీగుడ, లక్ష్మణ్ నాయక్ ఉన్నత పాఠశాలల్లో పర్యటించి, అక్కడి సమస్యలను తెలుసుకున్నారు. 5టీ పథకంలో ఆధునీకరణ జరుగుతున్న మరికొన్ని ఉన్నత పాఠశాలల్లో పనులను సమీక్షించారు. పేదలకు రూ.5 లకే ఆహారం పథకంలో భాగంగా గుణుపూర్ లోని ఆహార కేంద్రంలో ఆకస్మిక తనిఖీలు చేసిన కలెక్టర్ నాణ్యత గల ఆహారాన్ని అందివ్వాలని సంబంధిత అధికారులకు సూచించారు. అదేవిధంగా ఆహార కేంద్రంలోని సిబ్బందితో మాట్లాడారు.



ఆహార కేంద్రంలో సిబ్బందితో కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్

దాహార్తి తీర్చేందుకు చర్యలు



అడవిలో చెట్లపై తాగునీరు ఏర్పాటు చేస్తున్న అటవీశాఖ సిబ్బంది

జయపురం: ఈ ఏడాది వేసవి ప్రారంభం నుంచే ఎండలు మండుతున్నాయి. ఈ నేపథ్యంలో అడవుల్లో ఉండే పశుపక్షాదులకు దాహం తీర్చే లక్ష్యంతో తాగునీటి సౌకర్యాలు కల్పించాలని అటవీశాఖ అధికారులను రాష్ట్రప్రభుత్వం ఆదేశించింది. దీని ప్రకారం జయపురం అటవీ డివిజన్ అధికారులు వివిధ ప్రాంతాలలో చెట్లపై నీటి వనరులు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా కోర్టు సమీపంలోని పినాంకి అడవిలో నీటి కుప్పలతో ఉట్టెలను చెట్లపై అమర్చారు. వీటితో పక్షులకు దాహార్తి తీరుతుందని అభిప్రాయ పడుతున్నారు. అలాగే జయపురం అటవీ డివిజన్‌లో 23 జోన్లు ఉన్నాయని, ప్రతి జోన్‌లో 50 చొప్పున పక్షులు నీటిని తాగేందుకు సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. రోజూ ఉదయం వాటిలో నీటిని నింపుతామని జయపురం రేంజ్ అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న ప్రభుత్వ రేంజర్ సచ్చిదానంద పరిడా తెలిపారు. కార్యక్రమంలో పినాంకి అటవీ, వన్య ప్రాణి వార్డెన్ రామప్రసాద్ సాహు, వన్యప్రాణి సంరక్షక సంఘం కృష్ణకేశవ షాడంగి, ఆరతీ దాస్, ఫారెస్టర్ అరుణా జెనా, సిబ్బంది గౌతమ స్వాయి, సుశీల మహంతి, అనీల్‌దాస్, సతీష్ ఖొలా, చైతన్ చపాఢీ, గరా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నైజర్‌లో అగ్ని సురక్షా సప్తాహం



మాట్లాడుతున్న నైజర్ డైరెక్టర్ సుధాకర్ పండా

భువనేశ్వర్: నగరంలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(నైజర్) ప్రాంగణంలో అగ్ని సురక్షా సప్తాహం సోమవారం నిర్వహించారు. జీ-20 ప్రెసిడెన్సీ కార్యక్రమంలో భాగంగా దీనిని చేపట్టారు. ఈ నేపథ్యంలో అగ్నిమాపక చర్యలను ప్రతిబింబించే రీతిలో చిత్రలేఖనం, మాక్‌డ్రిల్ వంటి పలు కార్యక్రమాలు నిర్వహించారు. నిర్వాహక సంస్థ డైరెక్టర్ ప్రొఫెసర్ సుధాకర్ పండా అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ మాజీ ఉన్నతాధికారి భావగ్రాహి ఘొడై ప్రసంగించారు. అగ్ని ప్రమాదాలు సంభవించే సమయంలో తక్షణ రక్షణ కోసం నలువైపులా వచ్చిపోయే సుగమ మార్గం, అగ్నిమాపక నివారణ పరికరాలు, పనిముట్లు అనుక్షణం అందుబాటులో ఉంచాలని పిలుపునిచ్చారు. 1944 ముంబైలో సంభవించిన ఘోర అగ్రిప్రమాదంతో తేరుకొని, నివారణ మార్గదర్శకాలు వెలుగు చూసినట్లు వివరించారు.

పురుగు మందు తాగిన యువతులు

- ఒకరి మృతి.. మరొకరి పరిస్థితి ఆందోళనకరం



మృతురాలు సంగీత హెప్రుక



ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శివానీ పాలక

రాయగడ: జిల్లాలోని చందిలి పోలీస్ స్టేషన్ పరిధి కూలి పంచాయతీకి చెందిన ఉతకాపాడు గ్రామంలో ఇద్దరు యువతులు పురుగుల మందు తాగి, బలవన్మరణానికి ప్రయత్నించారు వీరిలో సంగీత హెప్రుక(15) మృతిచెందగా.. అదే గ్రామానికి చెందిన శివానీ పలక(14) మృత్యువుతో పోరాడుతోంది. వివరాల్లోకి వెళ్తే.. కూలి గ్రామంలోని ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న సంగీత పరీక్షలు అనంతరం తన సొంత గ్రామమైన ఉతకాపాడుకు ఇటీవల వచ్చింది. ఇంటి పక్కనే నివసిస్తున్న శివానీ, సంగీత చిన్ననాటి స్నేహితులు. ఈ క్రమంలో సోమవారం ఉదయం 9గంటలకు అంతా పొలం పనులకు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో సంగీత వద్దకు వచ్చిన శివానీ.. పురుగు మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నారు. గమనించిన యువతి తండ్రి సిరిమాఝి హెప్రుక ఇరుగు-పొరుగు వారిని పిలిచారు. దీంతో అక్కడకు చేరుకున్న గ్రామస్తులంతా ఇద్దరినీ సమీపంలోని కొలనార ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చికిత్స కోసం తీసుకువెళ్లారు. అక్కడ వైద్యం చేసిన డాక్టర్లు పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో వెంటనే జిల్లా కేంద్రాస్పత్రికి తరలించాలని సూచించారు. అనంతరం ఇద్దరినీ స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్సావస్థలో సంగీత మృతిచెందగా.. శివానీ మృత్యువుతో పోరాడుతుంది. అసలు ఇద్దరూ ఎందుకు ఈ అఘాయిత్యానికి దిగారో అనే విషయంపై కేసు నమోదు చేసిన పోలీసులు, దర్యాప్తు చేస్తున్నారు.

ప్రారంభమైన రథాలు



శాంతమ్మకు ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

- శాంతమ్మ సంబరాల్లో ఆకట్టుకుంటున్న వేషధారణలు

బరంపురం: దక్షిణ ఒడిశాలో ప్రసిద్ధి చెందిన బరంపురం గ్రామదేవత, మాబుడి శాంతమ్మ సంబరాలు 14వ రోజుకు చేరుకున్నాయి. రోజురోజుకీ భక్త సందోహం కిక్కిరిసి, అమ్మవారి దర్శనానికి తరలిస్తూ వస్తున్నారు. సోమవారం ఉదయం 5గంటల ప్రాంతంలో ఆలయ ప్రధాన అర్చకులు ప్రత్యేక ఏకాంత పూజలు అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉదయం నుంచి వేలాది మంది భక్తులు బారులుతీరి, శాంతమ్మను దర్శించుకుంటూ చీరలు, గాజులు, పసుపు, కుంకుమ, వెండి కళ్లు వంటివి కానుకలుగా తల్లికి సమర్పించుకొని మొక్కుబడులు తీర్చుకుంటు తల్లి అనుగ్రహం పొందుతున్నారు.

అమ్మవారి ఘటయాత్ర..

అమ్మవారి తాత్కాలిక ఆలయ ప్రాంగణంలో సంబరాల నిర్వహకులు పాతర్ల దుర్గాప్రసాద్ దేశిబెహరా సతీమణి పాతర్ల రేవతి ప్రధాన ఘటంతో బయలుదేరారు. పెద్ద బజార్‌లో జ్వాలాముఖి రథాలను శాంత్రను వీధిలో రంగులరట్నం ప్రారంభించారు. ఘటయాత్రలో తిరిగి రాత్రి 10గంటల సమయంలో దేశిబెహరా వీధిలో తాత్కాలి ఆలయానికి చేరుకున్నారు. ఘటయాత్ర సాగుతున్న సమయంలో వేలాది మంది మహిళా భక్తులు పాల్గొన్నారు.



పెద్ద బజార్‌లో ఆకట్టుకుంటున్న సలముకి రథాలు



సంబరాల్లో ఆకట్టుకుంటున్న కొరివి దయ్యాల విషధారణలో చిన్నారులు



భక్తజనం మధ్య సాగుతున్న ఘటయాత్ర



జ్వాలాముఖి రథాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ చంద్రశేఖర్ సాహు, ఎమ్మెల్యే విక్రమ్, మేయర్ సంఘమిత్ర

ముగిసిన బార్ ఎన్నికలు

- అవిభక్త కొరాపుట్ జిల్లాల నుంచి 1465 ఓట్ల నమోదు

జయపురం: ఒడిశా బార్ కౌన్సిల్ ఎన్నిక ఇటీవల ముగియగా, అవిభక్త కొరాపుట్ జిల్లాల నుంచి 1465మంది న్యాయవాదులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని జిల్లా బార్ అసోసియేషన్ వర్గాలు సోమవారం వెల్లడించారు. ఇందులో జయపురం జిల్లా బార్ అసోసియేషన్ సభ్యులు ముగ్గురు బరిలో ఉన్నారు. వీరిలో ఒడిశా బార్ కౌన్సిల్ మాజీ సభ్యుడు బిష్ణుప్రసాద్ పాత్రొ, పి.రమేష్‌పాత్రొ, పద్మజ స్వాయి, మల్కన్‌గిరి జిల్లా బార్ అసోసియేషన్ సభ్యుడు గోవింద పాత్రొ తలపడుతున్నారు. జయపురంలోని సబ్ డివిజనల్ జుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో ఈ ప్రక్రియను నిర్వహించారు. కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య ప్రశాంతంగా జరిగింది. కొరాపుట్ బార్ సంఘం నుంచి 556మంది న్యాయవాదులు ఉండగా.. 465మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఫస్ట్‌క్లాస్ జుడీషియల్ మెజిస్ట్రేట్ ఆదర్శకుమార్ బెహరా, సబ్ డివిజన్ జుడీషియల్ మెజిస్ట్రేట్ రేఖారాణి పండా పర్యవేక్షించారు. కొరాపుట్ నుంచి 191, కొట్‌పాడ్‌లో 45మంది, సెమిలిగుడలో 33మంది, నవరంగపూర్‌లో 165మంది, ఉమ్మరకోట్‌లో 120మంది, మల్కనగిరిలో 113మంది, 175మంది, బిస్సమ్‌కటక్‌లో 56మంది, గుణుపూర్‌లో 78మంది ఓటు హక్కు వినియోగించుకున్నట్లు సమాచారం.



జయపురంలో ఓటు వేసేందుకు క్యూకట్టిన న్యాయవాదులు

క్లుప్తంగా

రెండు రోజుల పాటు వేడి గాలులు

ఆమదాలవలస: జిల్లాలో రానున్న రెండురోజులు వేడి గాలులు వీచే అవకాశం ఉందని ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం వాతావరణ శాఖ శాస్త్రవేత్త డాక్టర్ మౌనిక సోమవారం తెలిపారు. మంగళవారం, బుధవారం అధిక ఉష్ణోగ్రతతో పాటు వేడి గాలులు వీచే అవకాశం ఉన్నందున పశువులు, గొర్రెలు, మేకలు ఉదయం 10గంటల నుంచి షెడ్డులలోనే ఉంచాలని సూచించారు. వేడి గాలులు తగలకుండా షెడ్డుకు గోనె సంచులు ఏర్పాటు చేసి వాటిని తడిపి మూగజీవాలకు వడదెబ్బ తగలకుండా కాపాడాలని సూచించారు. వేసవి పంటగా పెట్టిన పెసర, మినప పంటలకు సాయంకాలం సమయంలో నీరు పెట్టగలిగిన రైతులు నీరు పెట్టాలని సూచించారు. నీటిలో తేలికగా కరిగే 19-19 లేదా 13-0--45 వంటి ఎరువును పది గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

పాలీసెట్ ఉచిత శిక్షణ ప్రారంభం

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం మహిళా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమ వారం ఏపీ పాలీసెట్-23 ప్రవేశ పరీక్ష ఉచిత శిక్షణ ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ ఆదిలక్ష్మి తెలిపారు. కళాశాలలో సోమవారం మాట్లాడుతూ మే 10న ప్రవేశ పరీక్ష ఉంటుందని అన్నారు. ఈ నెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. 10వ తరగతి విద్యార్థులు హాల్ టిక్కెట్, ఆధార్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని, ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రాల్లో దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని వివరించారు. ఉచిత శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జిల్లా సీనియర్స్ టీ-20 క్రికెట్ జట్టు ఖరారు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా సీనియర్స్ టీ-20 క్రికెట్ జట్టు ఖరారైంది. 16 మంది సభ్యులతో కూడిన జిల్లా జట్టు జాబితాను శ్రీకాకుళం జిల్లా క్రికెట్ సంఘం ప్రధాన కార్యదర్శి ముస్తాక్ మహ్మద్ వెల్లడించారు. ఎంపికైన క్రీడాకారులతో కూడిన జిల్లా జట్టు ఈనెల 21 నుంచి విశాఖపట్నం వేదికగా జరగనున్న ఏసీఏ అంతర్ జిల్లాల టీ-20 క్రికెట్ టోర్నీలో ప్రాతినిధ్యం వహిస్తుందని ముస్తాక్ చెప్పారు. ఇటీవల ఎంపికైన 45 మంది జిల్లా ప్రాబబుల్స్ జట్టుకు కళింగపట్నం వేదికగా సెలెక్షన్ మ్యాచ్‌లను నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ మ్యాచ్‌ల్లో రాణింపుతోపాటు గత ట్రాక్ రికార్డులను పరిగణలోకి తీసుకుని 16 మందిని తుది జట్టుకు, స్టాండ్‌బైగా మరో ఆరుగురిని ఎంపిక చేసినట్టు పేర్కొన్నారు. సెలెక్టర్లుగా ఆర్‌సీ రెడ్డి, ఎం.ప్రవీణ్‌కుమార్, బి.శ్రీవర్ధన్ వ్యవహరించగా ఈ కార్యక్రమంలో క్రికెట్ సంఘ సంయుక్త కార్యదర్శి కెఎస్ఎం శైలానీ, సువ్వారి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

జట్టు వివరాలు..

టి.విజయ్ (కెప్టెన్), ఎం.ప్రణీత్, ఎం.సాయియశ్వంత్, ఎస్.హిమకర్, బి.సాత్విక్, ఎస్‌హెచ్ శ్రీనివాస్, ఎం.హరికృష్ణ, ఎం.సూర్యకిరణ్, బి.జయచంద్ర, డీవీఎస్ శ్రీరాం, డి.కులశేఖర్, టి.వినయ్, ఎ.నవీన్, ఆర్.చిన్నరాజు, ఎస్‌డీవీఎన్ ప్రసాద్ (వికెట్ కీపర్), జి.లవన్ (వికెట్ కీపర్) ఎంపికయ్యారు. స్టాండ్‌బైగా ఎన్ని జ్ఞానతేజ, ఎం.రోహిత్, ఎం.పూర్ణచంద్ర, జె.సయిూర్, కె.గణేష్, లక్ష్మీపతి, ఎంపికైన వారిలో ఉన్నారు.


గొర్రె పిల్లలపై కుక్కల దాడి



కుక్కల దాడిలో మృత్యువాత పడిన గొర్రె పిల్లలు

పోలాకి: మండలంలోని అంపలాం గ్రామంలోని బల్ల రాజుకు చెందిన గొర్రెపిల్లల మందపై సోమవారం వేకువజామున కుక్కలు దాడి చేశాయి. దాడిలో 19 గొర్రె పిల్లలు మృత్యువాత పడగా మరో 8 పిల్లలకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలాకి పశువైద్యాధికారి అనిల్ గ్రామానికి వెళ్లి గాయాలపాలైన గొర్రె పిల్లలకు చికిత్స చేశారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కణితి కృష్ణారావు బాధితుడిని ఓదార్చారు.

విద్యార్థి మృతిపై ఐటీడీఏ పీఓ ఆరా



పాతపట్నంలో మృతుని కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న పీఓ కల్పనకుమారి

మెళియాపుట్టి: పెద్దమడి పాఠశాలలో ఆదివారం విద్యార్థి సవర సుశాంత్ ఆత్మహత్య చేసుకున్న ఘటనకు సంబంధించి, విద్యార్థి పెంపుడు తల్లిదండ్రు లు అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో పెద్దమడి గురుకుల సంక్షేమ పాఠశాలను సీతంపేట ఐటీడీఏ పీఓ కల్పన కుమారి సందర్శించారు. విద్యార్థి మృతిపై ఆరా తీశారు. విద్యార్థులు, సిబ్బందిని పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. పెద్దమడిలో ఉన్న బాలికల ఆశ్రమ పాఠశాలను సైతం సందర్శించారు. అంతకుముందు పాతపట్నం ప్రభుత్వాస్పత్రిలో విద్యార్థి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమెతోపాటుగా ఎంపీడీఓ పడాల చంద్రకుమారి, తహసీల్దార్ సరోజిని, ఎంఈఓ దేవేంద్రరావు, సీఐ వినోద్ బాబు ఉన్నారు.



బరంపురం: బిజూ విగ్రహానికి పూలమాల వేస్తున్న బీజేడీ నాయకులు



కొరాపుట్: నవరంగ్‌పూర్‌లో బిజూ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ రమేష్ మాఝి, ఎమ్మెల్యేలు సదాశివ ప్రధాన్, మనోహర్



మల్కన్‌గిరి: బిజూ విగ్రహానికి నివాళులర్పిస్తున్న అధికారులు

యువతకు ఆదర్శం.. బిజూ

- బిజూ పట్నాయక్ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించిన నాయకులు, విద్యార్థులు

ఇండోనేషియా హీరో, ఉత్కళ వరపుత్రుడు, దివంగత ముఖ్యమంత్రి బిజు పట్నాయక్ నేటి యువతరానికి ఒక ఆదర్శవంతుడుగా నిలిచారని పలువురు వక్తలు కొనియాడారు. బిజూ బాబు ఆశయాలను ముందుకు తీసుకు వెళ్తామని కొనియాడారు. బిజూ సేవలు చిరస్మరణీయ, ప్రభుత్వ ఆస్పత్రుల వద్ద రోగులకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. ఆయన సేవలను కొనసాగించాలని హితవు పలికారు. – సాక్షి నెట్‌వర్క్



పర్లాకిమిడి: బిజూ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు రూపేష్ పాణిగ్రాహి



బరంపురం: రక్తదాన శిబిరంలో ఎంపీ చంద్రశేఖర్, ఎమ్మెల్యే విక్రమ్, మేయర్ సంఘమిత్ర



కొరాపుట్: లక్ష్మీపూర్‌లో శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు



రాయగడ: బిజు విగ్రహానికి పూలమాల వేస్తున్న నెక్కంటి, లాల్‌బిహారి

నివాళులర్పించిన సీఎం..



శాసనసభ ప్రాంగణంలో బిజూ పట్నాయక్ విగ్రహానికి నివాళులర్పించిన ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్

భువనేశ్వర్: బిజూ బాబు వర్ధంతి సందర్భంగా రాష్ట్ర శాసనసభ ప్రాంగణంలో ఉన్న విగ్రహానికి బీజేడీ సీఎం నవీన్ పట్నాయక్ శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా బిజూ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య సమరయోధుడు, ఒడిశా మాజీ సీఎం బిజూ పట్నాయక్ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి, ఒడిశా స్వాభిమాన్ పరిరక్షణకు చేసిన విశేష కృషి ప్రజల హృదయాల్లో ఎప్పటికీ గుర్తుండిపోతుందని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ నివాళులర్పించారు.



రాయగడ: ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముదులి

వనం వదిలి రాకుండా..

వనం వదిలి జనంలోకి వస్తున్న మూగజీవాలు ప్రాణాలు కోల్పోతున్నాయి. నీటి జాడలు వెతుక్కుంటూ అడవి సమీప గ్రామాల్లోకి అడుగు పెడుతున్న వన్య ప్రాణులు తిరిగి అరణ్యంలోకి వెళ్లలేకపోతున్నాయి. కుక్కల దాడిలో జింకలు, కరెంటు తీగలకు అడవి పందులు, వేటగాళ్ల ఉచ్చులకు దుప్పులు, అగ్ని ప్రమాదాలకు కుందేళ్లు నిలువునా బలైపోతున్నాయి. ఏనుగులు కూడా తమ ఆవాసాలు వదిలి కొండలు, గుట్టలు పట్టుకు తిరుగుతున్నాయి. ఈ అవస్థ నుంచి తప్పించేందుకు అటవీ శాఖ కృషి చేస్తోంది. అడవిలోనే నీరు దొరికేలా నీటి తొట్టెలు, సాసర్ పిట్స్ ఏర్పాటు చేస్తోంది.

- వన్య ప్రాణుల సంరక్షణకు కృషి
- అడవి జంతువుల దాహార్తి తీర్చేలా అటవీ శాఖ ప్రత్యేక చర్యలు
- విస్తృతంగా నీటి తొట్టెలు ఏర్పాటు

పాతపట్నం: జంతువుల పాదముద్రలు పడకుంటే అడవికి బతుకు లేదు. వనం విస్తీర్ణం తగ్గిపోతే జనంకు మనుగడ లేదు. అందుకే వన్య ప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత. వేసవి వచ్చిందంటే చాలు నీరు, ఆహారం దొరక్క వన్యప్రాణులు జనారణ్యంలోకి ప్రవేశించి ప్రాణాలు కోల్పోతున్నాయి. ఈ నేపథ్యంలో వన్యప్రాణుల రక్షణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో అటవీ శాఖ ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. జంతువుల దాహం తీర్చడంతో పాటు అడవుల సంరక్షణకు విశేష కృషి చేస్తోంది.

గొంతు తడిపేదిలా..

అడవుల్లో ఫైర్‌లైన్ ఏర్పాటు చేసి వృక్ష, జంతు జాలానికి రక్షణ కల్పిస్తున్నారు. అలాగే వన్యప్రాణుల సౌకర్యార్థం అదనంగా చెక్‌డ్యామ్‌లు, ఫారంపాండ్లు, సాసర్ రింగ్స్ లాంటివి ఏర్పాటు చేస్తున్నారు. ట్యాంకర్లు, మోటార్ పైపుల ద్వారా వీటిని నింపుతూ వన్య ప్రాణుల గొంతు తడుపుతున్నారు. కంపా నిధుల ద్వారా అడవుల సంరక్షణకు అటవీ శాఖ చేస్తున్న పనులు సత్ఫలితాలు ఇస్తున్నాయి. జిల్లాలోని నాలుగు ఫారెస్ట్ రేంజ్‌ల పరిధిలోని 64,400 హెక్టార్లలో అడవులు విస్తరించి ఉన్నాయి. శ్రీకాకుళం, టెక్కలి, పాతపట్నం, కాశీబుగ్గ రేంజ్‌లు ఉన్నాయి. పాతపట్నం ఫారెస్ట్ రేంజ్‌ల పరిధిలో జింకల సంచారం పెరిగిందని అధికారులు చెబుతున్నారు.

60 తొట్టెల ఏర్పాటు

జిల్లాలోని అన్ని ఫారెస్ట్ రేంజ్‌ల పరిధిలోని బిట్లలో సుమారు 60 నీటి తొట్టెలు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా వన్యప్రాణులకు సమృద్ధిగా తాగునీరు అందిస్తున్నారు. మరిన్ని సాసర్ పిట్స్, చెక్‌డ్యామ్‌లు, స్టెచ్చర్, పెర్కోలేషన్ ట్యాంకులు, నీటి కుంటల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించినట్లు అధికారులు చెబుతున్నారు.

అడవుల సంరక్షణపై అవగాహన

వేసవి వచ్చిందంటే కార్చిచ్చు బారిన పడి పచ్చటి సంపద కాస్తా బుగ్గిపాలవుతోంది. ఈ నేపథ్యంలో సమీపాన ఉన్న ప్రజలకు అడవుల సంరక్షణ, ప్రాముఖ్యతపై అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. కాపరులను కేవలం పశువుల మేత మేపేందుకు మాత్రమే అనుమతిస్తున్నారు. ఇతరులను అడవుల్లోకి వెళ్లనీకుండా అడ్డుకుంటున్నారు. అటవీ సంపద మంటల పాలు కాకుండా ఫైర్‌లైన్ల నిర్వహణపై దృష్టి పెట్టారు. అడవుల్లో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే శాటిలైట్ ద్వారా వచ్చే మెసేజ్ అలర్ట్‌తో ఆ ప్రాంతానికి చేరుకుని మంటలను నివారించేలా ఫైర్ బోయర్లను అందుబాటులో ఉంచారు.



ఇదే నీటి తొట్టె..

అటవీ శాఖ అధికారులు తొట్టెల్లోకి నీటిని నింపుతున్న ఈ ప్రాంతం అంతరాబ ఫారెస్ట్ బీట్ పరిధిలో ఉంది. వెడల్పుగా నిర్మించిన ఈ తొట్టెల్లోకి వారంలో రెండు సార్లు నీటిని నింపుతుండటంతో వన్యప్రాణులకు దాహం కష్టాలు తీరుతున్నాయి.



అంతరాబ ఫారెస్ట్‌లో ఏర్పాటు చేసిన నీటి స్ప్రింక్లర్లు

అడవుల విస్తరణకు కృషి



అడవుల విస్తరణకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. పలు జాతులకు చెందిన మొక్కలను పెంపొందించేలా కృషి చేస్తున్నాం. అడవులు, వన్యప్రాణులకు ముప్పు కల్పిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం. అనుమతులు లేకుండా అడవుల్లో సంచరించకూడదు. జంతులవులను వేటాడి పట్టుబడితే క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తాం.

– ఆర్.రాజశేఖర్, ఫారెస్ట్ రేంజర్, పాతపట్నం.



అంతరాబ ఫారెస్ట్‌లో పెంచుతున్న చెట్లు



స్వేచ్ఛగా వన్య ప్రాణుల సంచారం

జిల్లాలోని అడవిలో వన్య ప్రాణులు స్వేచ్ఛగా సంచరిస్తున్నాయి. దుప్పులు, కుందేళ్లు, జింకలు, నెమళ్లు, అడవి పందులు, పక్షులు ఎక్కువగా ఉన్నాయి. జగనన్న పచ్చ తోరణంలో భాగంగా జంతువులు, పక్షుల కోసం ఎక్కువగా నేరేడు, ఉసిరి, మారేడు, వెలమ, చింత, వేప, రావి, మర్రి వంటి పండ్ల మొక్కలను నాటి సంరక్షిస్తున్నారు. ఇదిలా ఉండగా మరిన్ని ప్రాంతాల్లో ఎర్రమద్ది, నల్ల మద్ది, సిందుగ, లోలుగ వంటి విత్తనాలను సేకరించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

దొంగనోట్ల వ్యవహారంపై
వారిని విచారించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ సరోజనమ్మ, ఎస్సీ సంఘాల నాయకులు

టెక్కలి: టెక్కలిలో ఇటీవల దొంగనోట్ల వ్యవహారంలో పట్టుబడిన పట్నాన అమృత సాగర్‌కు కొంత మంది టీడీపీ నాయకుల అండదండలు ఉన్నాయని.. దీనిపై పోలీసులు ఆయా నాయకులను విచారించాలని టెక్కలి ఎంపీపీ అట్ల సరోజనమ్మ, ఎస్సీ సంఘాల నాయకులు బసవల గోపాల్, బసవల రమేష్, బుసకల శ్రీనివాస్, తుంటు జగ్గారావు డిమాండ్ చేశారు. టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్ట పురుషోత్తం, రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి రెయ్యి ప్రీతీష్‌చంద్ర, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు పేర మురళీధర్‌కు దొంగనోట్ల వ్యవహారంలో పట్టుబడిన పట్నాన అమృతసాగర్ అనుచరుడన్నారు. టెక్కలిలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అక్రమాలకు పాల్పడడం, అక్రమాలను ప్రోత్సహించడం టీడీపీ నాయకులకు మొదటి నుంచి అలవాటేనని ఆరోపించారు. ఓ యువకుడు అక్రమ సంపాదనకు అలవాటు పడినపుడు మందలించకుండా దానిని ప్రోత్సహించే విధంగా టీడీపీ నాయకులు వ్యవహరించిన తీరు సిగ్గుచేటన్నారు. యువకుడు అక్రమంగా సంపాదించిన డబ్బుతో పార్టీ కార్యక్రమాలు నిర్వహించడం నీతిమాలిన చర్య అన్నారు. దొంగనోట్ల వ్యవహారంలో యువకుడిని అరెస్టు చేయడమే కాకుండా ఈ వ్యవహారంపై తక్షణమే పోలీసులు స్పందించి మట్ట పురుషోత్తం, రెయ్యి ప్రీతీష్‌చంద్ర, పేర మురళీధర్‌ను అదుపులోకి తీసుకుని విచారించాలని డిమాండ్ చేశారు. దొంగ నోట్ల వ్యవహారంలో టీడీపీ అనుచరుడు అడ్డంగా దొరికిపోవడంతో సదరు నాయకులకు భయం పట్టుకుందన్నారు. పురుషోత్తం, ప్రీతీష్‌చంద్ర, మురళీధర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

గురుకులం పిలుస్తోంది..



ఎస్‌ఎం పురం గురుకుల పాఠశాల

- ఎస్ఎంపురంలో బాలురు, వమరవల్లిలో బాలికల గురుకులాలు

ఎచ్చెర్ల క్యాంపస్: పేద విద్యార్థులకు ప్రమాణాలతో కూడిన ఇంగ్లిష్ మీడియం విద్యను అందించటంలో ఏపీ గురుకుల పాఠశాలలు ముందువరుసలో ఉంటాయి. విద్య, భోజనం, వసతి, ఇతర ప్రభుత్వ పథకాలు గురుకులాల్లో ఉచితంగా లభిస్తాయి. ఈ పాఠశాలల్లో చదివిన వారిలో చాలామంది అత్యున్నత స్థాయిలో ఉన్నారు. జిల్లాలో రెండు గురుకులాలు ఉండగా వాటిలో ఎస్ఎంపురంలో బాలురు, వమరవల్లిలో బాలికల పాఠశాలలు ఉన్నాయి. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. 5వ తరగతిలో నేరుగా ప్రవేశాలు కల్పిస్తుండగా.. 6, 7, 8 తరగతుల్లో ఖాళీ సీట్ల ప్రవేశాలకు, రాష్ట్రంలో ఇతర గురుకులాల్లో ఇంటర్మీడియట్, డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు.

ఖాళీలు ఇలా..

ఎస్.ఎం.పురం, వమరవల్లి గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతిలో 80 సీట్ల చొప్పున ఉన్నాయి. ఎస్ఎం పురంలో 6వ తరగతిలో నాలుగు, 8వ తరగతిలో ఒకటి, వమరవల్లిలో ఆరో తరగతిలో మూడు సీట్లు ఖాళీగా ఉన్నాయి. జిల్లాలోని రెండు పాఠశాలల్లో ఐదు నుంచి పదో తరగతి వరకు మాత్రమే క్లాస్ వర్కు నిర్వహిస్తున్నారు.

దరఖాస్తు ఇలా చేయాలి..

హెచ్‌టీటీపీఎస్://ఏపీఆర్ ఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఆధార్ కార్డు, పుట్టిన రోజు సర్టిఫికెట్ ఆధారంగా దరఖాస్తు చేసుకోవల్సి ఉంటుంది. పాఠశాలల్లో ప్రవేశానికి రూ. 100, కళాశాలల్లో ప్రవేశానికి దరఖాస్తు రుసం రూ.300గా నిర్ణయించారు. ఫొటో, అభ్యర్థి సంతకం వంటివి అప్‌లోడ్ చేయవల్సి ఉంటుంది. ధ్రువీకరణ పత్రాలు అప్‌లోడ్ అవసరం లేదు, కౌన్సెలింగ్ సమయంలో చూపించాల్సి ఉంటుంది.


- ఐదో తరగతిలో ప్రవేశానికి సంబంధించి 2022-23 విద్యా సంవత్సరంలో నాలుగో తరగతిని ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు సంస్థల్లో చదివి ఉండాలి. ఓసీ, బీసీ విద్యార్థులు 2012 నవంబర్ ఒకటి నుంచి 2014 ఆగస్టు 31వ తేదీ మధ్య, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 2010 నవంబర్ ఒకటి నుంచి 2014 ఆగస్టు 31వ తేదీ మధ్య జన్మించి ఉండాలి.

దరఖాస్తుల స్వీకరణ	ఏప్రిల్ 24వ తేదీలోపు
హాల్ టిక్కెట్ల జారీ	మే-12
ప్రవేశ పరీక్ష	మే-20
మొదటి విడత కౌన్సెలింగ్	జూన్-8
రెండో విడత కౌన్సెలింగ్	జూన్-16
మూడో విడత కౌన్సెలింగ్	జూన్-23

సమీపిస్తున్న దరఖాస్తు గడువు

దరఖాస్తు గడువు సమీపిస్తుంది. ఈ నెల 24వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి. 5, 6, 7, 8 తరగతుల్లో చేరేందుకు మే 20న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. హాల్ టిక్కెట్‌పై పరీక్ష కేంద్రం వివరాలు ఉంటాయి. ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరుగుతుంది. ఇంటర్మీడియెట్, డిగ్రీ కళాశాలల్లో ప్రవేశ పరీక్ష సైతం మే 20న మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహిస్తారు. వంద మార్కులకు పరీక్ష ఉంటుంది. ఐదో తరగతిలో ప్రవేశానికి నాలుగో తరగతి సిలబస్ ఆధారంగా ప్రశ్నలు వస్తాయి. తెలుగు నుంచి 20, ఇంగ్లిష్ నుంచి 20, గణితం నుంచి 30, పరిసరాల విజ్ఞానం నుంచి 30 మార్కులకు ప్రశ్నలు వస్తాయి.

మంచి అవకాశం



గురుకుల విద్య పేద విద్యార్థులకు మంచి అవకాశం. ప్రమాణాలతో కూడిన ఇంగ్లిష్ మీడియం విద్య అందుతుంది. అర్హత గల విద్యార్థులు ఈ నెల 24వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలి. ఐదో తరగతి ప్రవేశాలు సద్వినియోగం చేసుకోవాలి. ప్రత్యేక కరిక్యులమ్ ద్వారా విద్య అందుతుంది. పూర్తి వివరాలకు 98665 59611, 98665 59612 నంబర్లను సంప్రదించాలి.

– పి.శ్రీనివాసరావు, కన్వీనర్, ఎస్ఎం పురం గురుకులం ప్రిన్సిపాల్

సంబరాల వెలుగు

శ్రీస్వేచ్ఛావతి అమ్మవారి ఉత్సవాలు సోమ వారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారికి తైలమర్ధన, కుంకుమ మర్ధన, పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అమ్మవారిని ఊరిలోనికి ఆహ్వానించేందుకు వెదురుతో తయారు చేసిన జంగిడిలో మందార పుష్పాన్ని ఉంచి ఊరేగింపుగా తీసుకువెళ్లి.. సోమవారం అర్ధరాత్రి అమ్మవారిని ఆ పుష్పంతో అలంకరించి మేళతాళాలు, సన్నాయి వాయిద్యాలతో గ్రామదేవత ఆలయంలోని గర్భగుడిలో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిపై గల పుష్పం జంగిడిలో పడే వరకు పూజలు నిర్వహించారు. పుష్పం జంగిడిలో పడితేనే అమ్మ వారు ఉత్సవాలకు సిద్ధమైనట్లు భావిస్తారు. జంగిడిలోని అమ్మవారి ప్రతిరూపంగా భావించే మందార పుష్పంతో గిలాయివీధి, దబ్బూరి వీధి మీదుగా ఉప్పలవీధిలోని ఉత్సవ మండపంలో అమ్మవారిని ఆశీనులు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

–ఇచ్ఛాపురం



పట్టణంలో విద్యుత్ అలంకరణల ధగధగలు



ప్రత్యేక పూజలందుకున్న స్వేచ్ఛావతి అమ్మవారు

క్లుప్తంగా

ఇసుక లారీ సీజ్



సీజ్ చేసిన లారీతో ఎస్సై హరిబాబు నాయుడు

గుర్ల: అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని మండలంలోని ఆనందపురం వద్ద ఎస్సై హరిబాబు నాయుడు సోమవారం పట్టుకున్నారు. కోటగండ్రేడు, కలవచర్ల, గోషాడ, గుర్ల పరిసర ప్రాంతాల్లో అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను లారీలతో తరలిస్తున్నారని సమాచారం అందడంతో వెళ్లి ఇసుక తరలిస్తున్న ఒక లారీని పట్టుకుని సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అక్రమంగా ఇసుక తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వివాహిత ఆత్మహత్య



ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంధ్య

జియ్యమ్మవలస: మండలంలోని రామినాయుడువలస గ్రామానికి చెందిన పుర్రి సంధ్య (28) సోమవారం వేకువ జామున చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ మేరకు చినమేరంగి ఎస్సై జి.కళాధర్ అందించిన వివరాలిలా ఉన్నాయి. రామినాయుడువలసకు చెందిన పోలిరాజుతో 9 సంవత్సరాల క్రితం సంధ్య వివాహం జరిగింది. ఇద్దరు పిల్లలతో వారి కాపురం బాగానే సాగుతోంది. అయితే మనస్పర్థలతో ఆదివారం రాత్రి భార్యాభర్తలు ఘర్షణ పడడంతో సంధ్య మనస్తాపం చెందిన సోమవారం వేకువజామున ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి యడ్ల గౌరు ఫిర్యాదుతో అనుమానాస్పద మృతిగా కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ముద్దాయికి రూ.వెయ్యి జరిమానా

పార్వతీపురం: ఫిర్యాదు దారు పొలంలోకి చొరబడి నీరువెళ్లే ప్లాస్టిక్ పైపును రంపపు బ్లేడ్‌తో కోసి మోటార్ నుంచి వేరుచేసిన గరుగుబిల్లి మండలం రావుపల్లి గ్రామానికి చెందిన గుంట్రెడ్డి శివున్నాయుడు తండ్రి అప్పలస్వామి నాయుడిపై అభియోగం రుజువు కావడంతో పార్వతీపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి సోమవారం వెయ్యి రూపాయలు / రిమానా విధించినట్లు ఏపీపీ చంద్రకుమార్ తెలిపారు. 2019లో గుంట్రెడ్డి శివున్నాయుడు తండ్రి గట్టంనాయుడు ఫిర్యాదు మేరకు గరుగుబిల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు ఏపీపీ చంద్రకుమార్ ఫిర్యాదు ఆరు తరపున వాదించారు. విచారణలో అభియోగం రుజువు కావడంతో ముద్దాయికి జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు.

20 మొబైల్స్ రికవరీ



బాధితులకు సెల్ ఫోన్‌లను అందజేస్తున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: జిల్లాలో పోగొట్టుకున్న మొబైల్స్‌ను ట్రేస్ చేసేందుకు ఏర్పాటుచేసిన వెబ్‌పోర్టల్ విజెడ్‌ఎమ్ మొబైల్ ట్రాకర్ డాట్ ఇన్, వాట్సాప్ నంబర్ 8977945606కు వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా సైబర్ పోలీసులు చర్యలు చేపట్టి 20 స్మార్ట్ ఫోన్‌లను రికవరీ చేశారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ఎం.దీపిక చేతుల మీదుగా బాధితులకు వాటిని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి ఇతర రాష్ట్రాలకు తరలివెళ్లిన ఫోన్‌లను సైతం ఇక్కడికి తెప్పించగలుగుతున్నామన్నారు. బాధితులకు ఫోన్‌లను అందజేయడంతో వారిలో ఆనందం వెల్లివిరిసింది. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సీఐ ఇ.నరసింహమూర్తి, సైబర్ సెల్ ఎస్సై ప్రశాంతకుమార్, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

21న జాబ్‌మేళా

పార్వతీపురంటౌన్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పార్వతీపురం ప్రభుత్వం జూనియర్ కళాశాలలో ఈ నెల 21న జాబ్‌మేళా నిర్వహిస్తామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ కోర్సుల్లో 2019–2022 మధ్య ఉత్తీర్ణత సాధించి, 18–24 సంవత్సరాల మధ్య నిరుద్యోగ మహిళలు జాబ్‌మేళాకు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎస్ఎస్‌డీసీ.ఇన్ వెబ్‌సైట్‌లో పేరు నమోదు చేసుకోవాలన్నారు. రెజ్యూమ్, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు ఒరిజినల్, జెరాక్సులు, ఒక పాస్‌ఫొటోతో ఉదయం 10 గంటలకు జాబ్‌మేళాకు హాజరుకావాలని కోరారు. విద్యార్హతను బట్టి వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు సెల్: 91823 98325, 63034 93720 నంబర్లను సంప్రదించాలని కోరారు.



కలెక్టరేట్‌లో నాగుపాము కలకలం

విజయనగరం కలెక్టరేట్ ప్రాంగణంలో సోమవారం నాగుపాము సంచారం కలకలం రేపింది. ఉద్యోగులు విధులకు హాజరయ్యే సమయంలో విద్యాశాఖ కార్యాలయం పోర్టుకో సమీపంలో చెట్టుకింద పాము కనిపించింది. ఎరను మింగడంతో కదలకుండా అక్కడే ఉండిపోయింది. జనం గుమికూడడంతో కాసేపు బుసలు కొట్టింది. ఉద్యోగుల సమాచారం మేరకు స్నేక్ రాజు, అటవీశాఖ బీట్ ఆఫీజర్ శ్రీను వచ్చి పామును పట్టుకుని తీసుకెళ్లిపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

– విజయనగరం అర్బన్/పూల్‌బాగ్





294 కిలోల గంజాయి పట్టివేత



పట్టుబడిన గంజాయి, నిందితులతో ఎస్.కోట పోలీసులు

- ఐదుగురు వ్యక్తులు, రెండు కార్లు, 6 సెల్ ఫోన్లు, రూ.71వేలు నగదు స్వాధీనం

ఫొటో: అరకు నుంచి అక్రమంగా తరలివస్తున్న గంజాయిని ఎస్.కోట పోలీసులు పట్టుకున్నారు. రెండు పార్టీల నుంచి, 294 కిలోల గంజాయి, 71వేల నగదును సోమవారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్.కోట సీఐ సింహాద్రినాయుడు, ఎస్.ఐ తారకేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం..

ఎస్.కోట పట్టణ పోలీసులు పందిరప్పన్న కూడలిలో సోమవారం వాహనతనిఖీలు జరిపారు. అరకు నుంచి వస్తున్న స్విఫ్ట్ డిజైర్ వాహనాన్ని చెక్ చేయగా 124 కిలోల గంజాయి పట్టుబడింది. దీంతో వాహనంలో ప్రయాణం చేస్తున్న ఒక మహిళ, తమన్నా జావెద్‌షేక్ (నాసిక్), ఇద్దరు పురుషులు మొన్నివ్ సోఫియా అబ్దుల్‌బరి, మొన్నివ్ ఆజిమ్ (భీమండి) థానేలకు చెందిన మహారాష్ట్ర వాసులుగా గుర్తించారు. వీరి నుంచి నాలుగు సెల్ ఫోన్లు, రూ.71వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడి వారిలో తమన్నా జావెద్‌షేక్ ఇద్దరు పిల్లలు స్టేషన్‌లో బిక్కుబిక్కుమంటూ కూర్చున్నారు.



గంజాయితో పట్టుబడిన వాహనాలు

అలాగే, దేవీ కూడలిలో మధ్యాహ్నం నిర్వహించిన వాహన తనిఖీలలో డస్టర్ వెహికల్‌లో గంజాయి ఉన్నట్టు గుర్తించారు. దీంతో వెహికల్‌లో ఉన్న రాజస్థాన్ బిల్వారాకు చెందిన బరూలాల్ సర్గామ్, జత్‌పూరాకి చెందిన రోషల్‌మళిలను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రెండు మొబైల్స్, 170 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రెండు వాహనాలను సీజ్ చేశారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలిస్తున్నట్టు చెప్పారు.

గిరిజన వర్సిటీలో వర్క్‌షాప్



తొలిరోజు వర్క్‌షాప్‌లో పాల్గొన్న బోధన సిబ్బంది

విజయనగరం అర్బన్: కమిషన్ ఫర్ సైంటిఫిక్ అండ్ టెక్నికల్ టెర్మినాలజీ (సీఎస్‌టీటీ) సహకారంతో స్థానిక సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ ప్రాంగణంలో 'ఫండమెంటల్ గ్లాసరీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ (ఇంగ్లిష్, హిందీ, తెలుగు)' అనే అంశంపై ఐదురోజుల పాటు నిర్వహించే వర్క్‌షాప్ సోమవారం ప్రారంభమైంది. నూతన విద్యావిధానం-2020కు అనుగుణంగా ఇంజినీరింగ్ విద్యకు హిందీ మరియు ప్రాంతీయ భాషలలో వివిధ సబ్జెక్టుల పదకోశం రూపొందించేందుకు వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్టు గిరిజన వర్సిటీ వీసీ ప్రొఫెసర్ కట్టిమణి తెలిపారు. 1961 నుంచి శాస్త్రీయ, సాంకేతిక పరిభాషల పరిణామం కోసం సీఎస్‌టీటీ కృషిచేస్తోందన్నారు. వర్క్‌షాపులో 2,850 ఇంగ్లిష్, హిందీ పదాలకు తెలుగులో అర్థాలను రూపొందించబోతున్నామన్నారు. ఈ పదాల రూపకల్పనలో పలు కేంద్రీయ విశ్వవిద్యాలయాలు నిపుణుల సహకారం తీసుకుంటామని తెలిపా రు. కార్యక్రమంలో సీఎస్‌టీటీ తరపున జైసింగ్ రావత్, సైన్స్ అండ్ టెక్నాలజీ డీన్ ప్రొఫెసర్ శ్రీనివాస్, ఆర్ట్స్ అండ్ హ్యూమానిటీస్ డీన్ ప్రొఫెసర్ ముక్కామల శరత్ చంద్రబాబు, మానేజ్మెంట్ విభాగ డీన్ జితేంద్రమోహన్ మిశ్రా, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్ పర్యటన షెడ్యూల్ ఖరారు



టెక్కలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జిల్లా పర్యటన షెడ్యూల్ ఖరారైంది. సంతబొమ్మాళి మండలం మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేయడానికి ఈ నెల 19న సీఎం జిల్లాకు రానున్నారు. ఈ మేరకు అధికారులు షెడ్యూల్ ఖరారు చేశారు.

- బుధవారం ఉదయం 8 గంటలకు సీఎం క్యాంపు కార్యాలయం నుంచి గన్నవరం ఎయిర్‌పోర్టుకు బయల్దేరుతారు.
- ఉదయం 9.20కు విశాఖపట్టణం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు.
- 9:30 గంటలకు విశాఖపట్టణంలో బయల్దేరి సంతబొమ్మాళి మండలం మూలపేటలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు 10.15 గంటలకు చేరుకుంటారు.
- 10.20 గంటలకు హెలీప్యాడ్ వద్ద నాయకులు సీఎంకు స్వాగతం పలుకుతారు.
- 10.25 గంటలకు హెలీప్యాడ్ నుంచి పోర్టు శంకుస్థాపన పైలాన్ ఆవిష్కరణకు బయల్దేరుతారు.
- 10:30 నుంచి 10:47 వరకు పోర్టు శంకుస్థాపన, గంగమ్మ తల్లికి పూజా కార్యక్రమాల్లో పాల్గొంటారు.
- 11 గంటలకు మళ్లీ హెలీకాప్టర్‌లో బయల్దేరి 11.10 గంటలకు నౌపడ వద్ద ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు చేరుకుంటారు.
- 11.10 నుంచి 11.20 వరకు హెలీప్యాడ్ వద్ద నాయకులంతా సీఎంకు స్వాగతం పలుకుతారు.
- 11.25 గంటల నుంచి 11.35 వరకు నౌపడ వద్ద పోర్టు నిర్వాసిత కాలనీకి శంకుస్థాపన చేస్తారు. దీంతో పాటు ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్‌కు, హిరమండలం వంశధార లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు శంకుస్థాపన కార్యక్రమాలు చేస్తారు.
- 11.45 నుంచి 12 గంటల వరకు సభా వేదికపై ఇతర నాయకులు ప్రసంగిస్తారు.
- మధ్యాహ్నం 12 గంటల నుంచి 12.30 గంటల వరకు సభా వేదికపై సీఎం వైఎస్ జగన్ ప్రసంగం చేస్తారు.
- 12.35 గంటలకు మూలపేట, విష్ణుచక్రం గ్రామాల ప్రజలతో ముఖాముఖి నిర్వహిస్తారు.
- 12.40 గంటలకు సభా వేదిక నుంచి బయల్దేరి హెలీప్యాడ్ వద్దకు చేరుకుంటారు.
- 12.45 నుంచి 1.05 వరకు స్థానిక నాయకులతో మాట్లాడుతారు.
- మధ్యాహ్నం 1.10 గంటలకు హెలీకాప్టర్‌లో బయలుదేరి 2 గంటలకు విశాఖపట్టణం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు.
- మధ్యాహ్నం 2.10 గంటలకు విశాఖపట్టణం నుంచి గన్నవరం చేరుకుంటారు.
- మధ్యాహ్నం 3 గంటలకు గన్నవరం నుంచి సీఎం క్యాంపు కార్యాలయానికి చేరుకుంటారు.



నౌపడ సమీపంలో సిద్ధమవుతున్న సభా ప్రాంగణం

● పోర్టుతో నిరుద్యోగులకు భరోసా : ఎమ్మెల్సీ దువ్వాడ

కోటబొమ్మాళి: మూలపేట పోర్టుతో సుమారు 25 వేలమంది నిరుద్యోగులకు భరోసా లభించనుందని, వారి కోసం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. ఆయన సోమవారం ముఖ్యమంత్రి పర్యటనపై కొత్తపేట రెడ్డి కల్యాణ మండపంలో కోటబొమ్మాళి మండలానికి చెందిన నాయకులతో సమీక్ష నిర్వహించారు. శంకుస్థాపన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. వచ్చే జనానికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో టెక్కలి వైఎస్సార్‌సీపీ నాయకుడు చింతాడ గణపతి, వైస్ ఎంపీపీలు బోయిన నాగేశ్వరరావు, దుక్క రోజారాణి, పీఏసీఎస్ అధ్యక్షుడు బాడాన మురళి, మండల కో ఆప్షన్ సభ్యులు రంజాన్ రాజూబాయ్, వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ దుంగ శిమ్మన్న, వైఎస్సార్ సీపీ డాక్టర్స్ సెల్ అధ్యక్షుడు చింతాడ వరుణ్, సర్పంచ్‌లు నూక సత్యరాజ్, గురువెల్లి కేశవరావు, రామ్‌పాత్రుని సావిత్రి, సుంకరి జనార్దన, జి.నాగభూషణరావు, అల్లు కల్యాణి, ఆర్.రంగారెడ్డి పాల్గొన్నారు.

● జాబితా మేరకే ప్రవేశం



సభా ప్రాంగణం వద్ద కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ఎస్పీ రాధిక, జేసీ నవీన్‌కుమార్, సబ్ కలెక్టర్ రాహుల్, ఎమ్మెల్సీ దువ్వాడ, పేరాడ తిలక్ తదితరులు

టెక్కలి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో సీఎం కార్యాలయ వర్గాల నుంచి వచ్చిన జాబితా మేరకే హెలీప్యాడ్, వేదిక వద్దకు ప్రవేశం ఉంటుందని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ స్పష్టం చేశారు. ఈ నెల 19న మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు శంకుస్థాపన కోసం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ఎస్పీ జీఆర్ రాధిక, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, జేసీ ఎం.నవీన్‌కుమార్, టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డితో పాటు వివిధ శాఖలకు చెందిన అధికారులంతా నౌపడ సమీపంలో గల సభా ప్రాంగణం, హెలీప్యాడ్‌ను సోమవారం పరిశీలించారు. హెలీప్యాడ్ వద్దకు ఎంత మందికి అనుమతి ఉంది, సీఎంను ఎంత మంది కలుస్తారు వంటి అంశాలపై ఆరా తీశారు. సభా ప్రాంగణం వీఐపీ గ్యాలరీ, సామాన్య ప్రజలకు కేటాయించిన గ్యాలరీ వివరాలను తెలుసుకున్నారు. హెలీప్యాడ్ వద్దకు ముందస్తుగా కేటాయించిన వారికి మాత్రమే అనుమతులు ఉంటాయని కలెక్టర్ స్పష్టం చేశారు. వీరితో పాటు రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, జెడ్పీటీసీ పాల వసంత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

● పోర్టు నిర్మాణంతో మరింత అభివృద్ధి

- కేంద్ర మాజీ మంత్రి కృపారాణి



నౌపడ వద్ద సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కిల్లి కృపారాణి, రామ్మోహన్‌రావు తదితరులు

టెక్కలి: మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నిర్మాణంతో జిల్లా మరింత అభివృద్ధి చెందుతుందని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి అన్నారు. ఈ నెల 19న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా మూలపేట పోర్టు నిర్మాణ పనులకు శంకుస్థాపన నేపథ్యంలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌తో పాటు మూలపేట, నౌపడ వద్ద సీఎం పర్యటన ఏర్పాట్లను సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా హెలీప్యాడ్, సభా వేదిక ఏర్పాట్లను సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కృపారాణి మాట్లాడుతూ.. సంతబొమ్మాళి మండలంలో పోర్టు నిర్మాణం దశాబ్దాల కల అని పేర్కొన్నారు. పోర్టు కలను నెరవేరుస్తున్న సీఎం జగన్‌కు ఈ ప్రాంత ప్రజలంతా ఎంతో రుణపడి ఉంటారన్నారు. సుమారు నాలుగు వేల కోట్ల రూపాయలతో నిర్మాణం చేపట్టనున్న ఈ పోర్టుతో జిల్లాతో పాటు టెక్కలి నియోజకవర్గం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతోందన్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. నిర్వాసితుల కాలనీ కోసం రూ. 35 కోట్లు వెచ్చించడం గొప్ప విషయమన్నారు. ఈ పోర్టు నిర్మాణం పూర్తయిన తరువాత ఈ ప్రాంతంలో మత్స్యకారుల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్, వంశధార ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేయనున్నారని వెల్లడించారు. సీఎం జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. ఈమెతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ కె.రామ్మోహన్ రావు, టి.కిరణ్ ఉన్నారు.

చైన్ స్నాచింగ్ కేసులో ఇద్దరి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న టూటౌన్ సీఐ సీహెచ్. లక్ష్మణరావు (వెనుక ముసుగులో నిందితులు)

విజయనగరం క్రైమ్: చైన్ స్నాచింగ్ కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ సీహెచ్.లక్ష్మణరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. బాబామెట్ట ప్రభుత్వ బాలికల పాఠశాల సమీపంలో విద్యార్థులకు బిస్కెట్స్, చాక్లెట్స్ విక్రయించే మహిళ వద్దకు ఇద్దరు వ్యక్తులు ఈ నెల16న ఉదయం 11.30 గంటల ప్రాంతంలో పల్సర్ బైక్‌పై వచ్చి ఆమె దగ్గర ఏదో కొనుగోలు చేసే విధంగా మాట్లాడుతూ, మెడలో ఉన్న రెండున్నర తులాల బంగారు పుస్తెల తాడును తెంచుకుని పరారయ్యారు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదుపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు దాసన్నపేట వద్ద సోమవారం వాహన తనిఖీలు చేస్తుండగా పారిపోయేందుకు ప్రయత్నించిన శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం కుప్పిలి గ్రామానికి చెందిన నిఖిల్ రెడ్డి, అలుపున రెడ్డిలను అదుపులోకి తీసుకుని విచారణ చేసి వారి నుంచి పుస్తెలతాడు, పల్సర్ బైక్ రికవరీ చేశారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసులో క్రియాశీలకంగా పనిచేసిన ఎస్సై షేక్ శంకర్, ఏఎస్సై వై.పైడితల్లిని సీఐ అభినందించారు.

దారిదోపిడీ కేసులో ఐదుగురు..

డెంకాడ: మండలంలోని పెదతాడివాడ పంచాయతీ మాసన ఆస్పత్రి సమీపంలో విజయనగరం-నాతవలస ఆర్అండ్‌బీ రహదారిపై రాత్రి వేళ ఆటోను నిలిపేసి, డ్రైవర్‌ను గాయపరిచి, డ్రైవర్ వద్ద ఉన్న నగదు, సెల్‌ఫోన్ లాక్కున్న కేసులో ఐదుగురిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు హెచ్‌సీ సురేష్ తెలిపారు. ఆయన అందించిన వివరాలిలా ఉన్నాయి. డెంకాడ గ్రామానికి చెందిన బి.అశోక్, ఎం.రవి, జి.రాజు, జి.బంగార్రాజు, కె.సాయికుమార్‌లు ఆదివారం రాత్రి పెదతాడివాడ పరిధిలోని మాసన ఆస్పత్రి సమీపంలో ఆటోను అడ్డగించి డ్రైవర్ సురపతి సూర్యనారాయణను గాయపరిచి, ఆయన వద్ద ఉన్న రూ.4 వేలతో పాటు సెల్‌ఫోన్ లాక్కుపోపారు. ఈ ఘటనలో బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై మహేష్ కేసు నమోదు చేసి, నిందితులను కోర్టుకు తరలించారు.

చిరుధాన్యాల సాగు పెంచేలా రైతుకు అవగాహన



మాట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్

విజయనగరం అర్బన్: చిరుధాన్యాల సాగును పెంచేలా జిల్లాలోని రైతులకు అవగాహన కల్పించాలని జేసీ మయూర్ అశోక్ అన్నారు. స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో నాబార్డ్ ఆధ్వర్యంలో రైతు ఉత్పత్తిదారుల పని తీరుపై సోమవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రోన్లు వంటి సాంకేతిక పరిజ్ఞానం ద్వారా రైతులకు మెరుగైన సేవలను అందించాలని వ్యవసాయ సంబంధిత అధికారులకు సూచించారు. చిరుధాన్యల సాగును పెంచేలా రైతులకు అవగాహన కలిగించాలని తెలిపారు. లైసెన్సుల జారీ, కలెక్షన్ సెంటర్ల మంజూరులో జాప్యం చేయకూడదని అన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు ఎఫ్‌పీఓలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. వివిధ కేంద్ర సంస్థల ద్వారా ఏర్పాటు చేసిన రైతు ఉత్పత్తిదారులు తమ వ్యాపార కలాపాలు పెంచుకోవడం ద్వారా వారి ఆర్థిక పురోగతిని సాధించాలన్నారు. సమావేశంలో నాబార్డ్ డీడీ నాగార్జున, ఎల్‌డీఎం శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయాధికారి తారకరామారావు, పశు, మత్స్య శాఖల అధికారులు డాక్టర్ రమణ, నిర్మలాదేవి, మార్కెటింగ్ ఎ.డి శ్యామ్‌కుమార్ పలు స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

తైక్వాండో క్రీడాకారులకు బెల్టుల అందజేత



బెల్టులు సాధించిన క్రీడాకారులు

విజయనగరం రూరల్: కోరుకొండ సైనిక పాఠశాలలో తైక్వాండో క్రీడాకారులకు సోమవారం బెల్టు అర్హత పరీక్షలు నిర్వహించి, అర్హత పొందిన వారికి అందజేశారు. జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అర్హత పోటీలకు 100 మంది క్రీడాకారులకు హాజరయ్యారని జిల్లా తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి సీహెచ్ వేణుగోపాలరావు తెలిపారు. ఎల్లో, గ్రీన్, బ్లూ బెల్టులకు అర్హత పొందిన క్రీడాకారులకు ముఖ్యఅతిథిగా హాజరైన కోరుకొండ సైనిక పాఠశాల వైస్ ప్రిన్సిపాల్, వింగ్ కమాండర్ ఎస్.కేశవన్, తైక్వాండో ఇన్‌చార్జి ముల్లా రఫీక్‌లు బెల్టులు, ధ్రువీకరణపత్రాలను అందజేశారు. ఈ పోటీలకు రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ పరిశీలకుడిగా ఎం.అచ్చంనాయుడు, ఎగ్జామినర్‌గా సీహెచ్ వేణుగోపాలరావులు వ్యవహరించారు. ఈ సందర్భంగా బెల్టులు సాధించిన క్రీడాకారులను జిల్లా తైక్వాండో అధ్యక్షుడు గురాన అయ్యలు అభినందించారు.

వేట నిషేధాజ్ఞలు ఉల్లంఘించొద్దు


- మత్స్యశాఖ డీడీ నిర్మలాకుమారి



ముక్కాంలో మత్స్యకారులతో మాట్లాడుతున్న మత్స్యశాఖ డీడీ నిర్మలాకుమారి

భోగాపురం: సాగరంలో మత్స్య సంపద వృద్ధికి ప్రభుత్వం అమలుచేస్తున్న వేట నిషేధాజ్ఞలను మత్స్యకారులు పాటించాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని మత్స్యశాఖ డీడీ నిర్మలాకుమారి హెచ్చరించారు. భోగాపురం మండలం ముక్కాం తీర ప్రాంతాన్ని ఆమె సోమవారం పరిశీలించారు. మత్స్యకారులతో మాట్లాడారు. మత్స్యసంపద వృద్ధికి ఈ రెండు నెలలు కీలకమన్నారు. మిగిలిన కాలంలో చేపల వేట ఆశాజనంగా ఉండాలన్న ఉద్దేశంతో ఏటా వేట నిషేధాన్ని ప్రభుత్వం కొనసాగిస్తోందన్నారు. మే మొదటి వారంలో వేట నిషేధభృతి మత్స్యకారుల బ్యాంకు ఖాతాల్లో పడుతుందని స్పష్టంచేశారు. కార్యక్రమంలో ఎఫ్‌డీఓ చాందిని, సచివాలయ ఫిషరీస్ అసిస్టెంట్ షరీఫ్, మత్స్యకారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త బాధ్యతలు



సూపరింటెండెంట్ నారాయణరావు

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి కార్యాలయం సూపరింటెండెంట్‌గా సంచాన నారాయణ రావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన చీపురుపల్లి, బొండపల్లి పీహెచ్‌సీల్లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసి పదోన్నతిపై సూపరింటెండెంట్‌గా సర్వజన ఆస్పత్రిలో నియామకమయ్యారు. అలాగే, ప్రభుత్వ వైద్య కళాశాల కార్యాలయం సూపరింటెండెంట్‌గా ఎస్.సూరిబాబు బాధ్యతలు స్వీకరించారు. ఆయన అనకాపల్లి డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసి పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు.

పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ

పార్వతీపురం: పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు సిద్ధమయ్యే గిరిజన బాల, బాలికలకు మంగళవారం నుంచి గుమ్మలక్ష్మీపురంలోని ప్రభుత్వ మోడల్ రెసిడెన్షియల్ పాలిటెక్నిక్ కళాశాలలో ఉచితంగా శిక్షణ తరగతులు నిర్వహిస్తామని జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి బి.సూర్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది పదోతరగతి పరీక్ష రాసిన గిరిజన విద్యార్థినీ విద్యార్థులు శిక్షణకు అర్హులన్నారు. సాంకేతిక విద్యాశాఖ సంచాలకుడి ఆదేశాల మేరకు శిక్షణకాలంలో బాలురకు మాత్రమే ఉచిత భోజనం, వసతి సదుపాయం కల్పిస్తామన్నారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, సహాయ గిరిజన సంక్షేమాధికారులు తమ పరిధిలో పదోతరగతి పరీక్షలు రాసిన గిరిజన విద్యార్థులకు అవగాహన కల్పించి శిక్షణకు హాజరయ్యేలా చూడాలని కోరారు.